APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 168 | పేజీలు : 04 వెల రూ. 2/- | మంగళవారం 11-08-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 168 | PAGES : 04 PRICE : 2 | TUESDAY 11 AUGUST 2026



## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నిరసన దీక్షలు
- తాడిపత్రికి వెళుతున్న పెద్దిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డిలను అడ్డుకున్న పోలీసులు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అనంతపురంకు తరలించిన పోలీసులు

**అమరావతి :**
డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు.తాడిపత్రికి - మిగతా 2 లో

## పట్టాదారు పాస్ పుస్తకాలకు

# కరెన్సీ నోట్ల ఫీచర్లు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం
- పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం
- క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి :**
ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు."ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పని చేయాల్సిందే. పట్టాదార్ పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం.""సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే - మిగతా 2 లో

## కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు'



- పట్టాదారు పాస్ బుక్ లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- ఏలూరు జిల్లాలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలు ఆదరిస్తారని వ్యాఖ్య
- భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి

**అమరావతి :**
ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే జనం జై కొడతారని, లేకపోతే గత పాలకులకు పట్టిన - మిగతా 2 లో

## ఝార్ఖండ్‌లో విద్యార్థుల

# ఆందోళన ఉద్రిక్తం



- బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు
- వాటర్ కేనన్‌ల ప్రయోగం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

**ఝార్ఖండ్ :**
ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు - మిగతా 2 లో

## భారత రుతుపవనాలకు

# 'డాల్ఫిన్' దెబ్బ



- దేశంలో బలహీనపడుతున్న రుతుపవనాలకు కారణమవుతున్న డాల్ఫిన్ టైఫూన్
- పసిఫిక్ మహాసముద్రంలో మార్పులతో బంగాళాఖాతంలో తగ్గిన అల్పపీడనాలు
- దాదాపు 4,000 కిలోమీటర్ల దూరం నుంచే వాతావరణంలో మార్పులు

## మనిషి 200 ఏళ్లు బతకొచ్చు!

- శాస్త్రవేత్తల కొత్త సిద్ధాంతం, కానీ ఒక్క అడ్డంకిని అధిగమిస్తేనే!
- వృద్ధాప్య ప్రక్రియను అడ్డుకుంటే మనిషి 200 ఏళ్లకు పైగా జీవించవచ్చని అంచనా
- శరీరం కోలుకునే సహజ సామర్థ్యాన్ని కాపాడటమే కీలకమని పరిశోధకుల వెల్లడి
- ప్రస్తుతం 120-150 ఏళ్ల మధ్య ఈ శక్తి పూర్తిగా నశిస్తోందని గుర్తింపు
- డీఎన్ఏ డ్యామేజ్, ఇన్‌ఫ్లమేషన్ వంటివి సరిచేయగల సమస్యలేనని వెల్లడి
- గుండె, మెదడులో జన్యు మార్పులే అసలైన అడ్డంకి అని స్పష్టీకరణ



**ఢిల్లీ :**
వృద్ధాప్యానికి దారితీసే కొన్ని కీలక జీవసంబంధ ప్రక్రియలను - మిగతా 2 లో

## తమిళ గీతానికే

# తొలి ప్రాధాన్యం

- తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో మొదటగా 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడాలని అసెంబ్లీలో తీర్మానం
- సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి డీఎంకే, అన్నాడీఎంకే సహా అన్ని పార్టీల మద్దతు
- ఇది తమిళ అస్తిత్వానికి దక్కిన చారిత్రక గౌరవమని పేర్కొన్న సీఎం విజయ్
- అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం విజయ్



**చెన్నై :**
తమిళనాడు శాసనసభ సోమవారం ఒక చారిత్రక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే అధికారిక కార్యక్రమాలను ఇకపై తప్పనిసరిగా రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాళు_'తోనే ప్రారంభించాలని - మిగతా 2 లో



## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- బోనాల పండుగలను బీజేపీ నేతలు రాజకీయాలకు వాడుకుంటున్నారన్న ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని వ్యాఖ్య
- మహంకాళి అమ్మవారికి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారన్న శ్రీనివాస్

**హైదరాబాద్ :**
కేంద్ర మంత్రి బండి సంజయ్ బతుకంతా మతం పేరు చెప్పుకుని రాజకీయం చేయడమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా - మిగతా 2 లో

## డబుల్ బెడ్‌రూమ్

# ఇళ్ల పంపిణీలో రగడ



- మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి
- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

**హైదరాబాద్ :**
హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల - మిగతా 2 లో

## నాగార్జునసాగర్‌లో

# వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- నాగార్జునసాగర్‌లో విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో వరుణయాగం
- 11 హోమ గుండాలతో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు
- హాజరైన మంత్రులు, ముఖ్యనేతలు



**హైదరాబాద్ :**
రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహించింది. సాగర్‌లోని విజయ్ విహార్ ప్రాంగణంలో ఇవాళ తెల్లవారుజామున 4 గంటలకు యాగ క్రతువు ప్రారంభం అయింది. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు సూచించిన మేరకు 11 హోమ గుండాలతో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక క్రతువు వైభవోపేతంగా సాగింది. వరుణయాగం చివర్లో - మిగతా 2 లో

# సంపాదకీయం

## డీప్‌ఫేక్‌ల నుంచి డిజిటల్ మోసాల వరకు

**(నమ్మకమే లక్ష్యంగా మారుతున్న కొత్త ముప్పు)**

**-హెచ్.ప్రతాప్**



కృత్రిమ మేధస్సు ఆధునిక ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న సాంకేతిక విప్లవం. వైద్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమ, పరిశోధన, పరిపాలన వంటి రంగాల్లో ఇది కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తోంది. అయితే ఇదే సాంకేతికత దుర్వినియోగమైతే నిజాన్ని నకిలీగా, నకిలీని నిజంగా చూపించే ప్రమాదకర సాధనంగా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్‌లు, స్వర అనుకరణ, నకిలీ వీడియోలు, మోసపూరిత పెట్టుబడి ప్రకటనలు ప్రజల నమ్మకాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి.తాజాగా పుణేలో వెలుగుచూసిన ఘటన ఈ ప్రమాదానికి స్పష్టమైన ఉదాహరణ. రతన్ టాటా పేరుతో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియోను ఉపయోగించి ఒక మహిళను మోసం చేసి సుమారు రూ.4 లక్షలు దోచుకున్న ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన వీడియోను నిజమైనదిగా నమ్మిన బాధితురాలు మోసపోయినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.ఇది ఒక వ్యక్తి ఆర్థిక నష్టానికి సంబంధించిన ఘటనగా మాత్రమే చూడకూడదు. ప్రముఖుల ముఖాలు, స్వరాలు, హోదాలను అనుకరించి ప్రజల్లో విశ్వాసం కల్పించడం సైబర్ నేరాలకు కొత్త రూపాన్ని ఇస్తోంది. గతంలో నకిలీ లేఖలు, ఫోన్ కాల్స్, సందేశాలు మోసాలకు ఉపయోగపడితే, ఇప్పుడు మన కళ్లముందే కనిపించే వీడియోనే మోసానికి ఆధారంగా మార్చే పరిస్థితి వచ్చింది. అందుకే డిజిటల్ ప్రపంచంలో "చూశాను కాబట్టి నిజమే" అనే నమ్మకం ప్రమాదకరంగా మారుతోంది.ఈ ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ కూడా చట్టపరమైన చర్యలను బలోపేతం చేస్తోంది. 2026 ఫిబ్రవరిలో సవరించిన సమాచార సాంకేతిక నియమాల్లో లి"సింథటిక్‌గా రూపొందించిన సమాచారం"లికు ప్రత్యేక నిర్వచనం తీసుకొచ్చారు. నిజమైన వ్యక్తి లేదా సంఘటనలా కనిపించేలా కృత్రిమంగా లేదా అల్గారిథమ్‌ల ద్వారా రూపొందించిన, మార్చిన లేదా సవరించిన దృశ్య, శ్రవ్య సమాచారాన్ని ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. డీప్‌ఫేక్‌లు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన లేదా మార్చిన చిత్రాలు, వీడియోలు, స్వర అనుకరణలు ఇందుకు ఉదాహరణలు. ఈ సవరణలు 2026 ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి వచ్చాయి.అయితే చట్టాలు మాత్రమే సరిపోవు. సామాజిక మాధ్యమ వేదికలు కృత్రిమంగా రూపొందించిన సమాచారాన్ని స్పష్టంగా గుర్తించే విధానాలను సమర్థంగా అమలు చేయాలి. సైబర్ నేరాల దర్యాప్తు సంస్థలకు ఆధునిక డిజిటల్ ఫోరెన్సిక్ సామర్థ్యాలు పెంచాలి. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ సాక్షరత, సమాచార ధృవీకరణ, మీడియా అవగాహనను విద్యలో భాగం చేయాలి.ఇదే సమయంలో డిజిటల్ అరెస్టుల వంటి మోసాలపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరాలు ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, వాటిని అత్యంత తీవ్రమైన నేరాలుగా చూడాల్సిన అవసరం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది.కృత్రిమ మేధస్సును ఆపడం పరిష్కారం కాదు. దాని ప్రయోజనాలను వినియోగించుకుంటూనే దుర్వినియోగాన్ని అడ్డుకునే చట్టం, సాంకేతికత, నైతిక బాధ్యత, ప్రజల అప్రమత్తత అనే నాలుగు రక్షణ వలయాలు అవసరం.డిజిటల్ యుగంలో మనిషి వద్ద ఉన్న అత్యంత విలువైన ఆస్తి కేవలం సమాచారం కాదు---సత్యంపై ఉన్న నమ్మకం. ఆ నమ్మకం దెబ్బతింటే సాంకేతిక పురోగతికే అర్థం ఉండదు. అందుకే నేటి అత్యవసర ప్రశ్న ఒక్కటే---

**"కృత్రిమ మేధస్సు ఎంత తెలివైనది?" కాదు...**

**"మనం చూస్తున్నది నిజమని ఎలా నిర్ధారించాలి?"**

# పట్టాదారు పాస్ పుస్తకాలకు కరెన్సీ నోట్ల ఫీచర్లు

**మొదటిపేజీ తరువాయి -** చూశాం కదా 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది" అని చంద్రబాబు వివరించారు."7450 గ్రామాల్లో 32 లక్షల 22 వేల 346 పాస్‌పుస్తకాలు ఇచ్చాం. పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్



చేయకుండా తయారుచేశాం. ఎవరైనా ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే తెలిసిపోతుంది. క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది. మరో ఏడు నెలల్లో మొత్తం పట్టాదార్ పుస్తకాలు పంపిణీ చేయాలి. 9,365 గ్రామాలు ఉన్నాయి, 68 లక్షల 64 వేలమందికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. ఇవాళ 2 వేలమందికి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చాం. గుంతల పడిన రోడ్లను ఎక్కడికక్కడ సరిచేస్తున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."ముఠా కక్షలు, రౌడీయిజాన్ని అణచివేశాం. రాయల సీమలో ముఠా కక్షలు లేకుండా రూపుమాపాం. రోడ్డుపైకి వచ్చి విన్యాసాలు చేస్తే ఊరుకోవాలా?. మేము కట్టిన ప్రాజెక్టులన్నీ జగన్ కట్టానని చెబుతున్నారు. గొడ్డలి పార్టీకి అభివృద్ధి ముఖ్యం కాదు, విధ్వంసమే వారికి కావాల్సింది. నేను రౌడీయిజం చేయను, రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టం. స్వర్ణాంధ్ర నిర్మాణానికి సంకల్పం చేశా. నేను అనే సంకల్పానికి అందరూ సిద్ధంకండి. ప్రజా సంకల్పానికి సహకారం అందించే బాధ్యత మాది. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. అభివృద్ధికి ఎవరైనా అడ్డొస్తే ఊరుకునేది లేదు. జాతీయ జెండా - మనసులో సంకల్పం అజెండా. నేను - నా దేశం దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములే. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటండి.

## కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు'

**మొదటిపేజీ తరువాయి -** గతే పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం బటన్లు నొక్కి, పరదాల చాటున తిరిగితే ప్రజలు ఆదరించరని, అందుకే గత ప్రభుత్వాన్ని 11 సీట్లకే పరిమితం చేశారని పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏలూరు జిల్లా కలిదిండిలో సోమవారం నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, సుపరిపాలన అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌తో పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల భూ సమస్యలు తీవ్రమయ్యాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిష్కరించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే రీసర్వే చేపట్టినట్లు చంద్రబాబు వివరించారు. కొత్తగా అందిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలకు కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లతో పాటు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సాంకేతికతను జోడించామన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 9,365 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసి, 32.32 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని, మరో 68.64 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి నెలా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## మనిషి 200 ఏళ్లు బతకొచ్చు!

**మొదటిపేజీ తరువాయి -** నియంత్రించగలిగితే, మానవులు 200 ఏళ్లు దాటి జీవించడం సాధ్యమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సగటు ఆయుష్షు 146 నుంచి 194 ఏళ్లకు పెరగవచ్చని, కొందరు 200 ఏళ్ల మార్కును కూడా దాటవచ్చని వారి సైద్ధాంతిక నమూనాలు అంచనా వేస్తున్నాయి.ఒత్తిడి, అనారోగ్యం, కణాల స్థాయిలో జరిగే నష్టం నుంచి శరీరం కోలుకునే సహజ సామర్థ్యంపై ఈ పరిశోధన దృష్టి సారించింది. దీనినే 'ఫిజియోలాజికల్ రెసిలియెన్స్' అంటారు. వయసు పెరిగేకొద్దీ ఈ శక్తి క్రమంగా తగ్గిపోయి, సుమారు 120 నుంచి 150 ఏళ్ల మధ్య పూర్తిగా నశించిపోతుందని పరిశోధకులు గుర్తించారు. ఆ దశ తర్వాత చిన్న అనారోగ్యం కూడా ప్రాణాంతకంగా మారుతుంది.అయితే, కణాల మరమ్మతు వ్యవస్థలను కాపాడుకోవడం ద్వారా ఈ పరిస్థితిని మార్చవచ్చని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జీవక్రియల పనితీరులో లోపాలు, సరిచేయగల డీఎన్ఏ డ్యామేజ్, కణాల వృద్ధాప్యం, దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ వంటి అంశాలను నియంత్రించడంపై దృష్టి పెడితే ఆయుష్షును గణనీయంగా పెంచవచ్చని వారు పేర్కొంటున్నారు.కానీ, ఈ మార్గంలో ఒక పెద్ద అడ్డంకి ఉందని కూడా ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. అదే గుండె, మెదడు వంటి కీలక అవయవాల్లో నెమ్మదిగా పేరుకుపోయే జన్యుపరమైన మార్పులు (మ్యుటేషన్లు). ఈ అవయవాలకు పునరుత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో, ఈ మార్పులను సరిచేయడం దాదాపు అసాధ్యం. ఇతర వృద్ధాప్య ప్రక్రియలను ఆపగలిగినా, ఈ జన్యు మార్పులు చివరికి అవయవాల పనితీరును దెబ్బతీసి, ఆయుష్షుకు గరిష్ఠ పరిమితిని నిర్దేశిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం ఈ అంచనాలన్నీ సైద్ధాంతికమేనని వారు స్పష్టం చేశారు.

## ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం

**మొదటిపేజీ తరువాయి -** ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది.నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు.అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

### 16 రోజులుగా ఆందోళన

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

## భారత రుతుపవనాలకు 'డాల్ఫిన్' దెబ్బ

**మొదటిపేజీ తరువాయి -** చైనా తూర్పు తీరాన్ని వణికిస్తున్న 'డాల్ఫిన్' టైఫూన్ ప్రభావం సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత రుతుపవనాలపై పడుతోంది. ఈ టైఫూన్ వల్ల దేశానికి ప్రత్యక్షంగా ఎటువంటి ముప్పు లేనప్పటికీ, దీని కారణంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు రుతుపవన వ్యవస్థను బలహీనపరుస్తున్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తిమంతమైన టైఫూన్‌గా డాల్ఫిన్‌ను వాతావరణ శాఖ గుర్తించింది. ఆగస్టు 9న జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ సమీపంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో వీచిన పెను గాలులతో ఇది తీరాన్ని దాటింది. ఈ టైఫూన్ ధాటికి చైనా ప్రభుత్వం సుమారు పది లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, పలు చోట్ల భారీ వర్షాలు, వరదలు సంభవించాయి.అయితే, ఈ టైఫూన్ ప్రభావం భారత్‌పై పరోక్షంగా పడుతోంది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో నెలకొన్న అలజడి, ఎల్ నినో తరహా పరిస్థితులు కారణంగా వాతావరణ కదలికలు తూర్పు వైపునకు మళ్లుతున్నాయి. ఇది హిందూ మహాసముద్ర ప్రాంతంలోని వాతావరణ స్థితిగతులను ప్రభావితం చేస్తోంది. ఫలితంగా, భారత రుతుపవనాలకు కీలకమైన బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడకపోవడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి.డాల్ఫిన్ టైఫూన్ నేరుగా మన వర్షాలను నియంత్రిస్తోందని చెప్పలేమని, అయితే పసిఫిక్ సముద్రంలో చోటుచేసుకుంటున్న విస్తృత వాతావరణ మార్పులలో ఇది ఒక భాగమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడితేనే రుతుపవనాలు మళ్లీ పుంజు కుంటాయని, లేని పక్షంలో వర్షపాతంపై ప్రతికూల ప్రభావం కొనసాగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

## బండి సంజయ్ బతుకంతా మత రాజకీయమే

**మొదటిపేజీ తరువాయి -** నిలిచే బోనాల పండుగను కూడా బీజేపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిందని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు. బోనాల ఏర్పాట్లపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవించే లౌకిక ప్రభుత్వమని స్పష్టం చేశారు.హిందూ ధర్మాన్ని, ప్రాచీన ఆలయాలను కాపాడేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పునర్నిర్మాణానికి రూ.250 కోట్లు, బాసరకు రూ.225 కోట్లు, భద్రాచలానికి రూ.351 కోట్లు, గోదావరి పుష్కరాల అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించామని వివరించారు. అలాగే మొయినాబాద్, వేములవాడలలో రూ.197 కోట్లతో ఆధునిక గోశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆలయాల అభివృద్ధికి ఇంత భారీగా నిధులు కేటాయించారా? అని ప్రశ్నించిన ఆయన.. సంజయ్‌కి చేతనైతే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.ం

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ



**మొదటిపేజీ తరువాయి -** పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు.మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు.ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మొదటిపేజీ తరువాయి -** వెళ్లేందుకు అనుమతి లేదని వీరికి పోలీసులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో, పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు... వారిని అక్కడి నుంచి అనంతపురంకు తరలించారు.

# తమిళ గీతానికే తొలి ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి -** ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ సహా సభలోని అన్ని పక్షాలు దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ప్రకటించారు.ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తమిళ అస్తిత్వానికి, భాషా గౌరవానికి దక్కిన చారిత్రక విజయమని ఆయన అభివర్ణించారు. "తమిళం కేవలం ఒక భాష కాదు, అది ఒక ఆలోచన, సంస్కృతి, నాగరికత, జీవన విధానం, చైతన్యం" అని ఆయన పేర్కొన్నారు. 1891లో మనోన్మణియం సుందరనార్ రచించిన 'మనోన్మణియం' నాటకం నుంచి ఈ గీతాన్ని స్వీకరించారు. 1970 నుంచే ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని ఆలపిస్తున్నప్పటికీ, 2021లో అధికారికంగా రాష్ట్ర గీతంగా గుర్తించారు. ఈ తీర్మానం అమలుకు ఎలాంటి బాహ్య అనుమతులు అవసరం లేదని స్పీకర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని మొదటగా ఆలపించాలని జూలై 9న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచనలు జారీ చేసిన నేపథ్యంలో ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ఇతర గీతాల తర్వాత 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడటం రాష్ట్రంలో రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక హక్కులను పునరుద్ఘాటిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

# నాగార్జునసాగర్‌లో వరుణయాగం



**మొదటిపేజీ తరువాయి -** జరిగే పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.నదులు పరవళ్లు తొక్కాలని – రైతాంగం సుభిక్షంగా ఉండాలని : సాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు నిండాలని, కృష్ణా, గోదావరి నదులు పరవళ్ళు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వరుణయాగం నిర్వహించినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటూనే, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రకృతి అనుగ్రహాన్ని కూడా కోరుకుంటున్నామని మంత్రి చెప్పారు.పూర్ణాహుతి అనంతరం ముఖ్యమంత్రి నాగార్జున సాగర్ డ్యామ్‌ను పరిశీలించారు. జలాశయంలో డెడ్ స్టోరేజ్‌కు చేరిన నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరుణయాగంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# 6 వేల కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకిన ప్రచండ టైఫూన్ 'డాల్ఫిన్'

**10 లక్షల మందికి పైగా తరలింపు**

**తూర్పు చైనాను అతలాకుతలం చేస్తున్న డాల్ఫిన్ టైఫూన్**

**10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**వేలాది విమానాలు, రైళ్లు రద్దు..**

**స్తంభించిన జనజీవనం**

**ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన తుఫాను ఇదే**

**రాజధాని బీజింగ్ సహా 10 ప్రావిన్సులకు భారీ వర్షాల హెచ్చరిక**



ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ 'డాల్ఫిన్' తూర్పు తీర ప్రాంతంలో ప్రళయం సృష్టిస్తోంది. ఆదివారం సాయంత్రం తీరం దాటిన ఈ టైఫూన్ కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టైఫూన్ ప్రభావంతో రవాణా, పర్యాటక రంగాలు పూర్తిగా స్తంభించిపోయాయి.ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ నగరం సమీపంలో డాల్ఫిన్ టైఫూన్ తీరాన్ని తాకింది. ఆ సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గంట వ్యవధిలోనే సమీపంలోని వెన్‌జౌ నగరం వద్ద రెండోసారి తీరం దాటింది. దీంతో అధికారులు దేశంలోనే అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. టైఫూన్ తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.అధికారులు చేపట్టిన సహాయక చర్యలు మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఉన్నాయి. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 9 లక్షల మందిని, తైజౌలో 3.90 లక్షల మందిని, ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1.67 లక్షల మందిని, షాంఘైలో 2.15 లక్షల మందికి పైగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 1,500 అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.టైఫూన్ కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క షాంఘైలోనే సుమారు 1,500 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హ్యాంగ్‌జౌ విమానాశ్రయంలోనూ వందలాది విమానాలు నిలిచిపోయాయి. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 686 రోడ్డు మార్గాలు, 658 రైలు సర్వీసులను నిలిపివేశారు. పోర్టులు, ఫెర్రీ సేవలు కూడా మూతపడ్డాయి. షాంఘైలోని ప్రఖ్యాత లెగోలాండ్ రిసార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు. అలాగే, 234 ప్రధాన పర్యాటక కేంద్రాలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.దాదాపు 6,000 కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకడం ఈ టైఫూన్ ప్రత్యేకత. జులై చివరిలో మార్షల్ దీవుల వద్ద ఏర్పడిన ఈ టైఫూన్, చైనాకు రాకముందు జపాన్‌లోని ఒకినావా, ఫిలిప్పీన్స్ దేశాలపై కూడా తన ప్రభావాన్ని చూపింది. సోమవారం నాటికి టైఫూన్ బలహీనపడినా, ఇది దేశంలోని లోతట్టు ప్రాంతాల వైపు కదులుతోంది. దీనివల్ల రాజధాని బీజింగ్‌తో సహా 10కి పైగా ప్రావిన్సులలో రాబోయే రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బీజింగ్‌లో ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసి, వరద నియంత్రణ చర్యలు చేపట్టారు. నదులు, పర్వత ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జెజియాంగ్‌లో ఒక బాలుడు గల్లంతైనట్లు ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు అధికారిక ప్రకటన రాలేదు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన బాల్య మిత్రులు



(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : తుగ్గలి.: తుగ్గలి మండలం బొందిమాడుగుల గ్రామానికి చెందిన తమ 7వ తరగతి స్నేహితుడు వలి బాషా ఇటీవల మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి స్నేహితులు ముందుకు వచ్చారు .వలి బాషా పిల్లల భవిష్యత్తుకు కొంతమేర భరోసా కల్పించాలనే ఉద్దేశంతో 7వ తరగతి స్నేహితులంతా కలిసి రూ.40,000/- ఆర్థిక సహాయం అందించి, ఆ మొత్తాన్ని వలి బాషా పిల్లల పేర్లపై డిపాజిట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చాంద్ భాష, వీరచారి, రాముడు, లాలీపీరా, మనోహర్, మహేంద్ర, రామాంజినేయులు, సూరి, రాజవర్ధన్, సురేంద్ర నాయుడు, వెంకటేష్, రామకృష్ణ, లవన్న, రాజగోపాల్, మజీద్, ప్రకాష్, మహేశ్వరీ తదితర స్నేహితులు తమ వంతు సహాయాన్ని అందించారు.కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వంతో స్పందించిన ప్రతి ఒక్క స్నేహితుడికి వలి బాషా కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు."స్నేహం అంటే సంతోషంలో మాత్రమే తోడుగా ఉండటం కాదు... కష్టకాలంలో అండగా నిలిచి, ఆ కుటుంబానికి భరోసా కల్పించడమే నిజమైన స్నేహం." అని 7వ తరగతి స్నేహితులు నిరూపించారు.

## దేశవ్యాప్త జైల్ బరో ఆందోళన

### డోన్ పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వద్ద నిరసన






డోన్ (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న జైల్ బరో కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజు నంద్యాల జిల్లా, డోన్ మండలం,డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ డోన్ మండల అధ్యక్షుడు "ఎస్. పులి శేఖర్" అధ్యక్షత వహించారు. ఆందోళనలో సిపిఐ డోన్ పట్టణ, మండల కార్యదర్శులు మోట రాముడు, బి. నారాయణ, ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి ఎన్.కె. రామమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్వర్, ట్రెజరర్ సుధాకర్ నాయుడు, సి ఐ వి డి ఎస్ జిల్లా కార్యదర్శి ఎం. రామ్మోహన్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కార్యదర్శి ఎస్. జులేఖ, ఏ ఐ వై ఎఫ్ డోన్ పట్టణ కార్యదర్శి రజాక్ మౌలిలి, నాగరాజు, ఏపీ రైతు సంఘం కార్యదర్శి ఆర్. వరదరాజులు, ఆటో యూనియన్, హమాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.ప్రసంగించిన నాయకులు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి తరలించారు.

## ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఆదేశాల మేరకు 6వ వార్డు,లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం,..!!



మైదుకూరు (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, మైదుకూరు మున్సిపాలిటీ 6వ వార్డులో "ఇంటింటికి టీడీపీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చారు. అలాగే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాకెట్ రఫీ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పెద్దయ్య, 5వ వార్డు ఇన్‌చార్జ్ షేక్ అల్తాఫ్ హుస్సేన్, ఐ టిడిపి, ( ITDP) నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షైక్.ఆసీఫ్ హుస్సేన్, తెలుగు యువత ఉపాధ్యక్షులు శివరామ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనం కోసం స్థల సేకరణ,..!!



వేంపల్లి (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : వేంపల్లె మండలంలోని గండి బైపాస్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం కోసం రెవెన్యూ అధికారులు స్థల సేకరణను చేపట్టారు. అంబే ద్కర్ భవనం కోసం స్థలం కేటాయించాలని టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈశ్వర య్య రెవెన్యూ అధికారులను కోరడం జరిగింది. ఈనేపథ్యంలో సోమవారం అంబేద్కర్ భవనంకు స్థలం కేటాయించేందుకు ఆర్ఐ లోకేష్, విఆర్ఓ ఓబయ్య, టిడిపి ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ఈశ్వరయ్యలు వెళ్లి గండి రోడ్డులో స్థలం పరిశీలించారు. రెవెన్యూ అధికారి ఆదేశాల మేరకు స్థలం పరిశీలన చేస్తున్నట్లు ఆర్ఐ లోకేష్ తెలిపారు. స్థలం విషయంపై నివేదిక తయారు చేసి తాహసిల్దారు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. అంబేద్కర్ సేవా సమితి నాయకులు విన్నపం మేరకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

## పిజిఆర్ఎస్ పిటీషన్లకు చట్టబద్ధమైన పరిష్కారం చూపండి....జిల్లా ఎస్పీ పి.జగదీష్

- జిల్లా పోలీస్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ నిర్వహణ,106 పిటీషన్లు స్వీకరణ.
- పిటీషనర్లు, వెంట వచ్చిన ప్రజలకు ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజనం.





అనంతపురం అర్బన్(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : అనంతపురం:- పిజిఆర్ఎస్ పిటీషన్లకు జాప్యం లేకుండా చట్టబద్ధమైన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా 106 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బాధితుల నుంచి వచ్చిన ప్రతి పిటిషన్‌నూ బాధ్యతాయుతంగా విచారించాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి, నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేయాలన్నారు. ఫిర్యాదుపై విచారణ పూర్తయిన తర్వాత సంబంధిత పిటిషనర్‌కు తప్పనిసరిగా సమాచారం అందించి, వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలి. సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపించేలా అధికారులు దృష్టి సారించాలి.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పోలీస్ సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. కాగా, ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులకు దరఖాస్తుల నమోదులో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించారు. జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం పిటీషనర్ల నుండీ పిటీషన్లు స్వీకరించారు.

# జి .ఓ . 102 ను రద్దు చేయాలి

### లేకుంటే కూటమి పాలనను బీసీ , ఎస్సీ,ఎస్టీ, లు రద్దు చేస్తారు – ఆర్ పి ఎస్ హెచ్చరిక







నంద్యాల (స్ఫూర్తి పత్రిక) ఆగష్టు 10: మెడికల్ కౌన్సెలింగ్‌లో జి .ఓ . చీశీ. 102 ను వెంటనే రద్దు చేయాలని, జి .ఓ . చీశీ. 151 ప్రకారమే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రిజర్వేషన్ల పరిరక్షణ సమితి ఆర్ పి ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పిఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్‌లి ముఖ్యమంత్రికి హెచ్చరిక చేస్తూ "ఎన్నికల లబ్ది కోసం బీసీ , ఎస్సి ,ఎస్ టీ ల జపం చేస్తూ, మెడికల్ సీట్లలో, ఐఐటీ , ఐ ఐ యం సీట్లలో, గ్రూప్-1,2 ఉద్యోగాల్లో ఈ వర్గాలకు అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి కుట్రలు మానుకోకపోతే మిమ్మల్ని శాశ్వతంగా రాజకీయాల నుండి రద్దు చేసే బాధ్యత ఈ వర్గాల ఓటర్లు తీసుకుంటారు" అని అన్నారు.

### జి .ఓ . 102 వల్ల నష్టం ఏమిటి?

RPS నాయకులు జి .ఓ . 151 మరియు G.O. 102 మధ్య తేడాను వివరించారు.

– జి .ఓ . 151: "అల్ ఆప్షన్స్ " విధానం. ఎస్సీ ఎస్టీ బీసీ,విద్యార్థి నీట్ లో మంచి ర్యాంక్ తెస్తే ఓసీ సీటు మెరిట్‌పై వస్తుంది. అతని రిజర్వేషన్ సీటు మరో అదే వర్గం విద్యార్థికి దక్కుతుంది.

– జి .ఓ . 102: రిజర్వేషన్ విద్యార్థులకు ముందుగా వారి కోటా సీట్లనే కేటాయిస్తారు. ఓసీ సీటుకు వెళ్లే అవకాశం ఉండదు. దీంతో రిజర్వేషన్ వర్గాలకు మొత్తం సీట్లు తగ్గుతాయని ఆరోపించారు.

ఉదాహరణగా ఒక బీసీ విద్యార్థి 50వ ర్యాంక్ తెస్తే, 151 ప్రకారం ఓసీ సీటు వస్తుంది. 102 ప్రకారం బీసీ సీటునే ఇస్తారని తెలిపారు.

"ప్రభుత్వ మెడికల్ సీట్లు పెంచాలి. ఈ కుట్రపూరిత జి .ఓ . ను వెంటనే రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.

### పాల్గొన్నవారు:

RPS నంద్యాల యువజన సంఘం అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి ప్రసాదు, ఎస్ డి పి ఐ నాయకులు మజీద్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, పిడి ఎస్ యు జిల్లా కార్యదర్శి రాంబాబు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం వెంకటాద్రి, మైనార్టీ నాయకులు మున్నా, ఆర్ పి ఎస్ విద్యార్థి సంఘం నాయకులు హేమచంద్ర, కరిముల్లా, కాసిం, వినోద్, రామయ్య, మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన జైలు బరో కార్యక్రమం...




(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : పత్తికొండ: సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్బరో కార్యక్రమం ద్వారా గుత్తి రోడ్డు సర్కిల్లో స్తంభించిన ట్రాఫిక్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి. సిఐటియు ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ నరేంద్ర మోడీ విధానాలను తిప్పికొడతాం. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డిలి దేశ కార్మికుల భవిష్యత్తును అంధకారంలో నెట్టడానికి ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీ. సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో చేపట్టిన జైలు బరో కార్యక్రమం విజయవంతమైంది. సోమవారం పత్తికొండ పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం దగ్గర నుండి ప్రారంభమైన కార్మిక సంఘాల ర్యాలీ జైల్ బరో కార్యక్రమం గుత్తి సర్కిల్లో రాస్తారోకో చేయడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్కు అంతరాయం కలిగింది ఎక్కడకక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. అనంతరం పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు పోలీసులు జైల్ బరో కార్యక్రమాన్ని చేపట్టిన వారి పేర్లను నమోదు చేసుకున్నారు. కార్మిక సంఘాలు చేపట్టిన జైల్ బరో కార్యక్రమానికి సిఐటియు మండల అధ్యక్షులు గోపాల్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా సిఐటియు ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. ప్రభాకర్, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బుజ్జులు, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ కార్మిక భవిష్యత్తును అంధకారంలో నెట్టడానికి ప్రయత్నం చేస్తుందని దానిలో భాగంగానే 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం అమెరికా తో రైతంగ నల్ల ఒప్పందాలు చేసుకోవడం వి బి జి రాంజీ పేరుతో గ్రామీణ ఉపాధి చట్టాన్ని నీరు కరచడం వంటి విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దేశ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వారు మండిపడ్డారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ స్కీమ్ వర్కర్లను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని కనీస వేతనం 31 వేల రూపాయలు ఇవ్వాలని మోసపూరిత విబిజి రాంజీ నాలుగు లేబర్ కోడ్లను రైతాంగ నల్ల ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గల మండలం నాయకులు భాస్కర్ రెడ్డి శ్రీరాములు మద్దికేర మండలం రాముడు సీనియర్ నాయకులు రంగారెడ్డి దస్తగిరి వెంకటేశ్వర్లు గంగన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న (జై సింహ ) శికామణి ప్రజానాట్యమండలి నాయకులు కాశన్న శివశంకర్ డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు దుగ్గెన్న రైతు సంఘం పుచ్చకాయల మాడ రాముడు రాజుల కారప్ప రజక సంఘం నాయకులు ఈరన్న దేవనకొండ మండలం రైతులు చందోలి రైతులు సిఐటియు కార్మిక సంఘం నాయకులు ఉరుకుందు చంద్ర చిన్న హుస్సేన్ చెన్నయ్య మాణిక్యం మద్దయ్య ఆచారి ఉపాధి కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అనంతపురం నగర సమస్యలపై కలెక్టర్‌కు ఆర్ పి ఎస్ వినతి

### "కోట్లు పన్నులు వసూలు చేస్తున్నారు... కనీస సౌకర్యాలైనా కల్పించండి" - డాక్టర్ పోతుల నాగరాజు





డోన్ (స్ఫూర్తి పత్రిక) ఆగష్టు 10:అనంతపురం నగరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని లిరిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు గారు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు హరి కురుబ, యువత అధ్యక్షులు హేమంత్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, ఆర్ పి ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పోతుల నాగరాజు మాట్లాడుతూ "అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రజల నుంచి కోట్ల రూపాయలు పన్నులు వసూలు చేస్తున్నారు. కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదు. ఇక ఎవరికి చెప్పుకోవాలి?" అని ప్రశ్నించారు.

### నగరంలోని ప్రధాన సమస్యలు:

– ట్రాఫిక్ సమస్య: రోజూ రోడ్లపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పారిశుద్ధ్యం: రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో పలు రోగాలు వ్యాపిస్తున్నాయి.

– ఆక్రమణలు: ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు నడవలేని పరిస్థితి.

– విద్యా ఫీజులు: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అక్రమ ఫీజులు వసూలు చేసి ప్రజలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి.

– వైద్య ఫీజులు: ప్రైవేట్ క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో టోకెన్ ఫీజును 100 లోపు ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఇతర సమస్యలు: ఫ్లెక్సీల హంగామా, తాగునీటి అక్రమ వ్యాపారం, పాలు కల్తీ, రోడ్డు పక్కన ఆహారం, బస్టాండ్-రైల్వే స్టేషన్లలో ఆటో-వ్యాపారుల ఇబ్బందులు, రోడ్లపై ఫిష్-మటన్-చికెన్ వ్యాపారం వల్ల కలుషితం."పై సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలి. ప్రజలకు మెరుగైన జీవితం, ఆరోగ్యం అందించాలి" అని డాక్టర్ నాగరాజు కలెక్టర్‌ను కోరారు.

# ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలు



- 50డివిజన్లు, 4పంచాయతీల్లో భారీ స్థాయిలో వేడుకలు.
- అన్నదానం, రక్తదానం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు.
- కేక్ కటింగ్ లు, 3అన్న క్యాంటీన్లలో 3పూటలా ఉచిత భోజనం.





అనంతపురం అర్బన్ (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 10 : అనంతపురం:- అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జన్మదిన వేడుకల్ని పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు శుభాకాంక్షలు చెబుతూ.. నగరమంతటా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాంనగర్ 80ఫీట్ రోడ్డు నుంచి పాటు అర్బన్ టీడీపీ కార్యాలయం వరకు అంతటా సందడి వాతావరణం కనిపించింది. నగరంలోని 50డివిజన్లు, 4పంచాయతీల్లోను పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ ను కట్ చేశారు. అనంతరం దగ్గుపాటి ఫౌండేషన్ తరుపున నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఉచితంగా భోజనం అందించారు. టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ లు అన్న క్యాంటీన్ లలో భోజనం వడ్డించారు. అలాగే నగరంలోని అన్ని ఆలయాల్లో దగ్గుపాటి ప్రసాద్ పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్ట్ రోడ్డు లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో టీడీపీ నాయకుడు కేశవ నాయుడు 101 టెంకాయలు కొట్టారు. సరిపూటి రమణ ఆధ్వర్యంలో జీసస్ నగర్ లో కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి 101 టెంకాయలు కొట్టారు. కొవ్వూరు నగర్ లోని వెంకటేశ్వర దేవాలయంలో టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణిరవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్లస్టర్ ఇన్ ఛార్జ్ కాయగూరుల శ్రీధర్ ఆధ్వర్యంలో పాత ఊర్లోని రెడ్ క్రాస్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడు, టిడిపి నాయకుడు మున్నా నగర్ రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అరవింద్ నగర్ లోని వృద్ధాశ్రమం నందు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళ వారి కాలనీ నందు చీరలు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు ఆధ్వర్యంలో నారాయణపురంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో గొటుకూరు లోని బెరాకా ఆశ్రమం నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ వన్నూరప్ప ఆధ్వర్యంలో బ్లైండ్ హాస్టల్ నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాలలో చిన్న పిల్లలకు పుస్తకాలను అందించారు. రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమాలలో, అనాథాశ్రమాలలో కేక్ కటింగ్ లు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఎటు చూసినా జై దగ్గుపాటి అన్న నినాదాలతో మారు మ్రోగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటితో తమకు రెండున్నర సంవత్సరాల పరిచయమే అయినప్పటికీ ఎంతో ఆప్తుడిగా మారారన్నారు. ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ఒక ప్రత్యేక అభిమానం సంపాదించుకున్నారన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆయన ముందుగా స్పందిస్తుంటారన్నారు. ఆయన నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. అలాగే పార్టీ కూడా మరింత బలోపేతం అవుతుందన్నారు.

### కార్గో 'త్రీ-వీలర్ల'కు రెండో విడత సబ్సిడీ..

# ఒక్కో ఆటోకు ఎంతొస్తుందంటే?



ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద కార్గో త్రీ వీలర్ ఆటోలకు రెండో విడత సబ్సిడీని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అనుకున్న లక్ష్యాన్ని ముందుగానే చేరుకున్న క్రమంలో ముందుగానే ప్రారంభించింది. రెండో విడతలో ఒక్కో త్రీవిలర్‌కు రూ.25 వేల వరకు సబ్సిడీ ఇవ్వనుంది కేంద్రం. మరి ఆ వివరాలు ఇప్పుడే తెలుసుకుందాం. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను తీసుకొచ్చిన సంగతి తెలిసింది. ప్రస్తుతం పీఎం ఇ-డ్రైవ్ స్కీమ్ అందుబాటులో ఉంది. దీని ద్వారా రెండు విడతలుగా రాయితీ కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే సరకు రవాణా కోసం ఉపయోగించే ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు (ఆటో రిక్షాలు) కొనుగోలుదారులకు రెండో విడత సబ్సిడీ ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై కొనుగోలు చేసే విద్యుత్ త్రీ చక్రవాహనాలకు రెండో విడత సబ్సిడీ వర్తించనుంది. మరి ఒక్కో ఆటోకు ఎంత సబ్సిడీ వస్తుంది? అనేది తెలుసుకుందాం.ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10,900 కోట్లతో పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో మొదటి విడతలో త్రీ-వీలర్ల విభాగంలో ఒక్కో వాహనానికి రూ.50 వేల చొప్పున సబ్సిడీ అందించింది. ఇక రెండో విడతలో దానిలో సంగం అంటే రూ.25 వేలు సబ్సిడీ ఇవ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 2024లోనే పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని కేంద్ర ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎల్5 కేటగిరి ఎలక్ట్రిక్ త్రీవీలర్ వాహనాల విభాగంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 80,546 వాహనాలకు, వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో 1,24,846 వాహనాలకు రాయితీ కల్పించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. అయితే ఈ ఆర్థిక ఏడాది లక్ష్యాన్ని నవంబర్ 7, 2024 నాటికే సబ్సిటీ ఇవ్వాల్సిన వాహనాల సంఖ్య 80,546 దాటిపోయింది.ఈ కారణంగానే వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 అంటే ఏప్రిల్ 1, 2025 నుంచి ప్రారంభించాల్సిన రెండో విడత రాయితీ పథకాన్ని ముందుగానే ప్రారంభించింది. నవంబర్ 8, 2024 నుంచి 2026, మార్చి 31 వరకు వాహన పోర్టల్‌లో నమోదయ్యే 1,24,846 ఎలక్ట్రిక్ కార్గో త్రీవీలర్లకు ఈ సబ్సిడీ అందించనుంది. వాహనాలను బట్టి కిలోవాట్ అవర్ బ్యాటరీకి రూ.2,500 చొప్పున సబ్సిడీ ఇవ్వనుంది. తొలి విడతలో కిలోవాట్ అవర్ బ్యాటరీకీ రూ.5 వేల చొప్పున రాయితీ కల్పించింది. రెండో విడతలో అందులో సగం ఇస్తామని ముందుగానే నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీ వీలర్లకు రూ.10,900 కోట్లు రాయితీ కల్పించాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది.

## ప్రభుత్వ స్కీమ్ PPFలో ఇన్వెస్ట్ చేయాలా? ఇలా ఇంట్లోంచే SBIలో అకౌంట్ తీసుకోవచ్చు!




కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పొదుపు పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో మీరు డబ్బులు పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా? అయితే మీరు పోస్టాఫీసుతో పాటు బ్యాంకుల్లోనూ ఖాతా తీసుకొవచ్చు. మీరు దేశీయ దిగ్గజ బ్యాంక్ ఎస్బీఐలో చాలా ఈజీగా పీపీఎఫ్ అకౌంట్ తీసుకోవచ్చు. ఇంట్లో కూర్చునే యోనో యాప్ ద్వారా చాలా సింపుల్ ప్రాసెస్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఆ వివరాలు ఇప్పుడే తెలుసుకుందాం. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) స్కీమ్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. దీర్ఘకాలంలో ఇందులో మంచి రాబడి అందుకోవచ్చు. పోస్టాఫీసుతో పాటు బ్యాంకుల్లోనూ ఈ స్కీమ్‌లో చేరేందుకు అవకాశం ఉంది. మీరు కూడా పీపీఎఫ్ పథకంలో పెట్టుబడి పెట్టాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే ఇది మీకోసమే. మీరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%వాదీ×%)లో చాలా సులభంగా పీపీఎఫ్ ఖాతా తెరవవచ్చు. ఎస్‌బీఐ యోనో యాప్ (%ూచీూ ూజూజూ%) ద్వారా తమ పేరుపై ఈజీగా పీపీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు.ఈ పథకంలో ఒకేసారి లంప్‌సమ్ విధానంలో పెట్టుబడి పెట్టవచ్చు లేదా విడతల వారీగా కొద్ది కొద్దిగా ఇన్వెస్ట్ చేయవచ్చు. ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదీన వడ్డీ అనేది జమ అవుతుంటుంది. ప్రతి నెల 5వ తేదీలోపు ఉన్న కనీస బ్యాలెన్స్ ఆధారంగా వడ్డీ లెక్కిస్తారు. అంటే ప్రతి నెలా 5వ తేదీలోపు డబ్బులు జమ చేసినట్లయితే దానిపైనా వడ్డీ వస్తుంది. దీంతో ఎక్కువ రాబడి పొందవచ్చు.. అయితే ఎస్‌బీఐ యోనో యాప్ ద్వారా ఇంట్లో నుంచే ఏ విధంగా పీపీఎఫ్ అకౌంట్ తెరవవచ్చో ఇప్పుడు మన ఈజీ స్టెప్స్‌లో తెలుసుకుందాం.ముందుగా ఎస్‌బీఐ యోనో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యోనో యాప్ లోకి లాగిన్ కావాలి. అందులో మై ఇన్వెస్ట్‌మెంట్స్ ఆప్షన్‌లోకి వెళ్లిన తర్వాత కొత్త పీపీఎఫ్ అకౌంట్ కోసం అప్లికేషన్ కోసం ఓపెన్ పీపీఎఫ్ అకౌంట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.రెండో స్టెప్‌లో మీ వివరాలు వెరిఫై చేసి బ్రాంచీని ఎంచుకోవాలి. అందుకోసం మీ ఖాతా ఉన్న హెూమ్ బ్రాంచ్ లేదా ఇతర బ్రాంచీలను ఎంచుకోవచ్చు. అయితే, డీఫాల్ట్‌గా హెూమ్ బ్రాంచీ ఉంటుంది. లేదా బ్రాంచ్ కోడ్, జీపీఎస్ లొకేషన్ ఆధారంగా వేరే బ్రాంచీలను సైతం ఎంచుకునే వీలుంటుంది.మూడో స్టెప్‌లో నామినీ వివరాలు ఇవ్వాలి. పీపీఎఫ్ ఖాతాకు గరిష్ఠంగా నలుగురి పేర్లను నామినీలుగా చేర్చవచ్చు.నాలుగో స్టెప్‌లో యోనో యాప్ లావాదేవీ ఖాతాల నుంచి క్రెడిట్ల కోసం నెలవారీ స్టాండింగ్ సూచనలను సెటప్ చేయాలి.ఐదో స్టెప్‌లో మీ వివరాలను ఓసారి పునఃసమీక్షించుకుని డేటాను ధ్రువీకరించాలి. అలాగే మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కి వచ్చే ఓటీపీని ఎంటర్ చేసి నియమ నిబంధనలకు యాక్సెప్ట్ చేయాలి.చివరగా మీకు పీపీఎఫ్ అకౌంట్ ఓపెనింగ్ ప్రాసెస్ పూర్తవుతుంది. ఆ తర్వాత మీ తొలి విడత పెట్టుబడి చెల్లించాలి.

## అధిక వడ్డీ ఇచ్చే స్పెషల్ 'ఎఫ్‌డీ' స్కీమ్.. ఇంకో 2 రోజులే ఛాన్స్.. రూ.5 లక్షలకు ఎంతొస్తుంది?

అధిక వడ్డీ ఆఫర్ చేస్తూ ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఇండియన్ బ్యాంక్ అందిస్తోన్న స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్ గడువు ఈనెలాఖరుతో ముగుస్తుంది. ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసే వారికి గరిష్ఠంగా 8.05 శాతం మేర వడ్డీ అందిస్తోంది. అధిక వడ్డీ కోరుకునే వారు నవంబర్ 30వ తేదీలోపు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మరి ఇందులు రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి ఎంతొస్తుంది? కాల వ్యవధి ఎంత? అనే పూర్తి వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ బ్యాంక్ తమ కస్టమర్ల కోసం అత్యధిక వడ్డీ రేటు ఆఫర్ చేస్తూ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు అందిస్తోంది. అందులో ఓ స్కీమ్ గడువు నవంబర్ 30, 2024తో ముగుస్తుంది. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా 8.05 శాతం మేర వడ్డీ పొందవచ్చు. ఎలాంటి రిస్క్ లేకుండా అధిక రాబడి కోరుకునే వారు గడువు ముగిసేలోపు ఇందులో ఇన్వెస్ట్ చేయడం మంచిది. ఇప్పటికే పలు మార్లు ఈ స్కీమ్ గడువు పొడిగించిన క్రమంలో మరోసారి పొడిగించే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఇండియన్ బ్యాంకు సాధారణంగా డిపాజట్లపై 2.80 శాతం నుంచి 7.10 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. స్పెషల్ స్కీమ్ ద్వారా మాత్రమే 8.05 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.

ఇండ్ సూపర్ 300 డేస్ స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్..

ఇండ్ సూపర్ 300 డేస్ స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్ కాల వ్యవధి 300 రోజులుగా ఉంటుంది. ఇందులో రూ. 5 వేల నుంచి రూ. 3 కోట్ల వరకు డబ్బులు డిపాజిట్ చేసుకోవచ్చు. సాధారణ కస్టమర్లకు అయితే వడ్డీ రేటు 7.05 శాతం ఆఫర్ చేస్తోంది. అదే 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం, 80 ఏళ్ల వయసు దాటిన సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇందులో జనరల్ కస్టమర్ రూ. 5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ. 5,29,700 వరకు వస్తాయి. అదే సీనియర్లకు రూ. 5,31,800 వరకు, సూపర్ సీనియర్లు అయితే రూ. 5,32,900 వరకు లభిస్తాయి.

ఇండ్ సూపర్ 400 డేస్ స్కీమ్..

ఇండియన్ బ్యాంకు ఇండ్ సూపర్ 400 డేస్ స్కీమ్ ద్వారా అధిక వడ్డీ ఇస్తోంది. ఈ స్కీమ్ కాల వ్యవధి 400 రోజులుగా ఉంటుంది. కనీసం రూ. 10 వేల నుంచి రూ. 3 కోట్ల వరకు డిపాజిట్ చేయవచ్చు. సాధారణ డిపాజిటర్లకు 7.30 శాతం వడ్డీ ఇస్తుండగా.. సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.05 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇందులో సాధారణ డిపాజిట్ రూ.5 లక్షలు జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ. 5,40,000 వరకు వస్తాయి. అదే సీనియర్ సిటిజన్ అయితే రూ. 5,42,700 వరకు, సూపర్ సీనియర్ సిటిజన్ అయితే రూ. 5,44,000 వరకు లభిస్తాయి.

### ఒకటి కన్నా ఎక్కువ పాన్ కార్డులుంటే

# రూ.10 వేలు ఫైన్.. వెంటనే ఇలా సరెండర్ చేయండి!

కేంద్ర ప్రభుత్వ పాన్ కార్డులో కీలక మార్పులు చేస్తోంది. క్యూఆర్ కోడ్‌తో కొత్త పాన్ కార్డులు ఇవ్వనుంది. ఈ క్రమంలో తలెత్తుతున్న పలు ప్రశ్నలకు వివరణ ఇచ్చింది. ఒకటికి మించి పాన్ కార్డులు ఉన్న వారు ఏం చేయాలి? తమ పేరుపై ఎన్ని పాన్ కార్డులు ఉన్నాయని తెలుసుకోవడం ఎలా? ఉంటే ఎక్స్ ట్రా కార్డును ఎలా సరెండర్ చేయాలనే విషయాలను వెల్లడించింది. ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం ప్రకారం ఒకటికి మించి పాన్ కార్డులు ఉంటే రూ.10 వేల వరకు జరిమానా కట్టాల్సి రావచ్చు. మరి మీ పేరుపై ఎన్ని కార్డులు ఉన్నాయో చెక్ చేసుకోండి. ఆదాయపు పన్ను విభాగం పర్మనెంట్ అకౌంట్ నంబర్ (పాన్) 2.0 ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా పన్ను చెల్లింపుదారులకు సేవలను మరింత సులభతరం చేయడం, పాన్ కార్డులు, ట్యాన్ కార్డుల జారీ, నిర్వహణను అధునికీకరణించడం వంటి వాటి కోసం ఈ కొత్త ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్‌తో కొత్త పాన్ కార్డులను జారీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో పన్ను చెల్లింపుదారుల్లో పలు ప్రశ్నలు తెలత్తాయి. ఈ క్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం పాన్ 2.0 ప్రాజెక్టుకు సంబంధిచిన తరుచూ అడిగే ప్రశ్నలకు వివరణ ఇచ్చింది. ఈ మేరకు నవంబర్ 26వ తేదీన పీఐబీ ఓ ప్రకటన విడుదల చేసింది.అందులో ప్రధానంగా ఒకటి కన్నా ఎక్కువ పాన్ కార్డులు కలిగి ఉన్న ట్యాక్స్ పేయర్ల పరిస్థితి ఏంటి? తమ పేరుపై ఎన్ని పాన్ కార్డులు ఉన్నాయని ఎలా తెలుసుకోవాలి? ఉంటే పెనాల్టీ చర్యలను ఎదుర్కోకుండా ఏ విధంగా ఆ కార్డును రద్దు చేయాలి? అనే ప్రశ్నపై చర్చ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదాయపు పన్ను వివరణ ప్రకారం.. 'ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం 1961లోని నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఒకటికి మించి పాన్ కార్డులు కలిగి ఉండకూడదు. ఒక వేళ ఏ వ్యక్తి వద్దనైనా ఒకటికి మించి పాన్ కార్డులు ఉంటే.. వెంటనే జురిసిడిక్షనల్ అసెసింగ్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లాలి. అదనపు పాన్ కార్డును డిలిట్ లేదా డీయాక్టివేట్ చేయించాలి. పాన్ 2.0 ప్రాజెక్టులో భాగంగా డుప్లికేట్ పాన్ రిక్వెస్టులను ఈజీగా గుర్తించే వ్యవస్థ వస్తోంది. ఒకటికి మించి పాన్ కార్డుల జారీని తగ్గించేందుకు తగిన సాంకేతికతను తీసుకోస్తున్నాం.' అని పేర్కొంది.కాబట్టి మీకు జారీ చేయబడిన ఏదైన ఇతర పాన్ మీకు కనిపిస్తే ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయడం ద్వారా మీరు దాన్ని త్వరగా రద్దు చేసుకోవాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టంలోని సెక్షన్ 272బీ ప్రకారం ఒకటికి మించి పాన్ కార్డులు ఉంటే మీపై ట్యాక్స్ ఆఫీర్ రూ.10 వేల వరకు పెనాల్టీ విధించేందుకు అవకాశం ఉంది. అందుకే రూ.10 వేల జరిమానా పడకముందే అదనపు కార్డును సరెండర్ చేయాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను వెబ్‌సైట్ ప్రకారం..' అదనపు పాన్ కార్డులను సరెండర్ చేసేందుకు మీరు పాన్ చేంజ్ రిక్వెస్ట్ అప్లికేషన్ ఫారాన్ని నింపి సబ్మిట్ చేయాలి. ఆ ఫారంపై మీరు ఉపయోగించే పాన్ కార్డు నంబర్‌ను రాయాల్సి ఉంటుంది. అలాగే మీ పేరుపై ఉన్న ఇతర పాన్ కార్డుల వివరాలన్నీ ఫారంలోని ఐటమ్ నంబర్ 11లో సూచించాలి. ఆయా పాన్ కార్డుల కాపీలను జత చేసి సంబంధిత ఇన్‌కమ్ ట్యాక్స్ అసెసింగ్ ఆఫీసర్‌కు సబ్మిట్ చేయాలి.' దీంతో మీకు అవసరం లేని పాన్ కార్డులు రద్దు చేస్తారు.




## రూ.27 కోట్ల ఐపీఎల్ వేతనంలో..

# పంత్ చేతికి వచ్చేది ఎంత..? కట్టే పన్నులు ఎంత..?




ఐపీఎల్ 2025 మెగా వేలంలో రిషబ్ పంత్‌ను రూ.27 కోట్లకు లక్నో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. 2025 ఐపీఎల్ సీజన్‌కు గానూ పంత్‌కు లక్నో యాజమాన్యం రూ.27 కోట్ల వేతనం చెల్లిస్తుంది. అయితే అతడి చేతికి మాత్రం అంత మొత్తం అందదు. పన్నులు, సెస్‌లు పోనూ మిగతా మొత్తాన్ని రిషబ్ అందుకోనున్నాడు.ఐపీఎల్ 2025 మెగా వేలంలో టీమిండియా స్టార్ ప్లేయర్ రిషబ్ పంత్ రూ.27 కోట్లకు అమ్ముడై.. లీగ్ వేలం చరిత్రలో సరికొత్త రికార్డును నమోదు చేశాడు. వేలం తొలి రోజు రిషబ్ పంత్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ రూ.20.75 కోట్లకు గరిష్టంగా బిడ్ వేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఆర్టీఎం ఉపయోగించడంతో.. ఏకంగా రూ.27 కోట్లు ఆఫర్ చేసి మరీ లక్నో పంత్‌ను దక్కించుకుంది.2022 డిసెంబర్ చివర్లో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన రిషబ్ పంత్.. ఇక క్రికెట్ ఆడటం కష్టమని భావించారంతా. కానీ మోకాలి సర్జరీ చేయించుకున్న రిషబ్.. పట్టుదలతో మళ్లీ బ్యాట్ చేతపట్టాడు. టీమిండియాలో చోటు దక్కించుకోవడమే కాకుండా.. మళ్లీ మునపటి ఆటతీరును కనబరుస్తూ భారత జట్టులో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు.ఎట్టి పరిస్థితుల్లో నమ్మకం కోల్పోకూడదనే స్వభావం ఉన్న పంత్‌ను తాము పక్కా ప్లానింగ్‌తోనే కొనుగోలు చేశామని.. అతడి కోసం రూ.25 కోట్ల నుంచి రూ.27 కోట్లు ఖర్చు చేయాలని ముందే అనుకున్నామని లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా తెలిపారు.ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్ వేలంలో రూ.27 కోట్లు పలికినప్పటికీ.. పన్నుల కారణంగా అతడి చేతికి మాత్రం అంత మొత్తం అందదు. పంత్ ఐపీఎల్ వేతనంపై 30 శాతం ఆదాయపు పన్ను వసూలు చేస్తారు. అంటే రూ.27 కోట్ల జీతంలో ఐటీనే రూ.8.06 కోట్లు ఉంటుంది. ఇక మిగిలేది రూ.18.94 కోట్లు. సర్‌ఛార్జీ, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సుంకాలు కూడా కలుపుకుంటే.. పంత్‌కు లక్నో ఇవ్వనున్న రూ.2 కోట్లలో రూ.11.48 కోట్లకుపైనే భారత ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అప్పుడు సుమారుగా రూ.15.52 కోట్లు పంత్ చేతికి అందుతాయి అయితే మేనేజర్ ఫీజు, ప్రయాణ ఖర్చులు, అకామిడేషన్, ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లు, అకౌంటింగ్, ఇతరత్రా ఖర్చులను చూపిస్తే.. పంత్ చేతికి వచ్చే మొత్తం పెరగొచ్చు. ఒకవేళ సర్‌ఛార్జీలేవీ లేకుండా 30 శాతం పన్ను మాత్రమే కట్టాల్సి వస్తే.. పంత్ చేతికి రూ.18.9 కోట్లు వస్తాయి.నూతన ఆదాయ పన్ను విధానం ప్రకారం.. పంత్ అందుకునే రూ.27 కోట్లలో.. 30 శాతం ఐటీ, 25 శాతం సర్‌ఛార్జీ, 4 శాతం సెస్ పోను రూ.16.47 కోట్లు చేతికి వస్తాయని రాజశ్రీ దాస్‌గుప్తా అనే నిపుణుడు తెలిపారు.ఒకవేళ పంత్ గనుక ఐపీఎల్ సమయంలో గాయపడితే.. అతడికి పూర్తి వేతనం అందుతుంది. అదే టోర్నీకి ముందే గాయపడి.. ఐపీఎల్‌లో ఆడలేకపోతే పంత్ బదులు మరో ఆటగాణ్ని తీసుకునే హక్కు ఫ్రాంచైజీకి ఉంటుంది. టోర్నీకి ముందు గాయపడిన విదేశీ ఆటగాళ్లకు ఎలాంటి పరిహారం చెల్లించరు. అదే కాంట్రాక్టు ఉన్న టీమిండియా ప్లేయర్ గాయపడి ఐపీఎల్‌కు అందుబాటులో లేకపోతే. బీసీసీఐ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా అతడికి పూర్తి మొత్తాన్ని చెల్లిస్తారు. 2023 ఐపీఎల్ సీజన్లో యాక్సిడెంట్ కారణంగా ఆడనప్పటికీ.. పంత్‌కు ఇలాగే పూర్తి వేతనం చెల్లించారు.

## ఇన్ఫోసిస్- రిలయన్స్ యాప్‌తో నెలకు

# రూ. 30 లక్షల ఆదాయం..! వైరల్ వీడియోలో నిజమెంత?

సోషల్ మీడియాలో ఇటీవలి కాలంలో విస్తృతంగా నకిలీ సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీని బారిన పడి నష్టపోయే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. డబ్బులు కోల్పోవడం, సున్నితమైన డేటా కోల్పోవడం వంటి నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. ఇదే క్రమంలో ఇటీవల ఏఐ సాయంతో డీప్ ఫేక్ వీడియోలు రూపొందించి కూడా ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు రిలయన్స్- ఇన్ఫోసిస్ సంస్థలు కలిపి ఒక యాప్ రూపొందించినట్లు.. దీనితో భారత పౌరులు డబ్బులు సంపాదించొచ్చంటూ ఒక వీడియో వైరల్ అవుతుంది. ఇది నిజమైనదేనా చూద్దాం. టెక్నాలజీ ఎంత అభివృద్ధి అవుతుందో.. అదే రీతిన మరోవైపు నుంచి చెడు కూడా పెరిగిపోతోంది. అంటే లాభాలతో పాటే నష్టాలూ వెంటాడుతున్నాయి. మనం చెప్పకపోయినా.. చెప్పినట్లు స్టేట్‌మెంట్ల నుంచి వీడియోల వరకు దర్శనమిస్తున్నాయి. ప్రముఖులు ఎక్కువగా దీని బారిన పడుతున్నారు. ముఖ్యంగా డీప్‌ఫేక్స్ ఎక్కువయ్యాయి. ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ సాయంతో డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించి.. ప్రజల్ని మోసం చేసే ప్రయత్నాలు పెరిగిపోతున్నాయి. గేమింగ్ యాప్స్, ఫైనాన్షియల్ యాప్స్ మొదలైన వాటిని పాపులర్ చేయించేందుకు విరాట్ కోహ్లీ, ముకేశ్ అంబానీ, నీరజ్ చోప్రా, సుధా మూర్తి వంటి ప్రముఖుల డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించి వదులుతున్నారు. వీటిల్లో వీడియోల్ని చూసి ప్రజలు తొందరగా మోసపోతారని చెప్పొచ్చు. ఆర్థికంగా లాభాలు వస్తాయని నమ్మిస్తుంటారు. ఇది నమ్మే జనం దీంట్లో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధపడతారు. ఇప్పుడు ఇలాగే.. భారత పౌరులు డబ్బులు సంపాదించుకునేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ కలిసి ఒక యాప్ రూపొందించినట్లు వీడియో వైరల్ అవుతుంది.ఇన్ఫోసిస్ కో ఫౌండర్లు నారాయణ మూర్తి, నందన్ నీలేకని.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ.. ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో తాము అభివృద్ధి చేసిన యాప్ గురించి చర్చిస్తున్నట్లు వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

### క్లెయిమ్ ఏంటంటే..?

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ సంస్థలు కలిసి.. భారత పౌరులు డబ్బులు సంపాదించుకునేందుకు ఒక ఆటోమేటెడ్ యాప్ రూపొందించాయి. దీని ద్వారా నెలకు రూ. 30 లక్షల వరకు సంపాదించొచ్చు.

### వాస్తవం ఏంటి?

ఈ యాప్ సృష్టించారన్న దాంట్లో ఎలాంటి నిజం లేదు. దీనిని వీడియో ఏఐ ద్వారా రూపొందించారు. ఇన్ఫోసిస్, రిలయన్స్ కలిసి అలాంటి యాప్ ఏదీ ప్రారంభించలేదు.వీడియోలో కుడి వైపున పైన ఇండియా టుడే లోగో ఉంది. జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అందులో ముగ్గురు దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో కలిసి మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ముకేశ్ అంబానీ, నందన్ నీలేకని, నారాయణ మూర్తి ముగ్గురు అక్కడ ఉన్నారు. భారత పౌరులు సులువుగా డబ్బును ఆర్జించగలిగే యాప్ అభివృద్ధి చేస్తున్నామని అందులో చెప్పారు. తానే స్వయంగా యాప్ ఉపయోగించి చెక్ చేశానని నారాయణ మూర్తి వీడియోలో చెప్పారు. ముకేశ్ కూడా తాము అత్యుత్తమ ఇంజినీర్లను నియమించుకున్నట్లు అందులో చెబుతున్నట్లు ఉంది. నందన్ నీలేకని కూడా ఆర్థిక వ్యవస్థను పెంచేందుకు ఇదే మంచి అవకాశం అని అందులో చెప్పారు. మొదటి 50 వేల మంది భారతీయులు బెనిఫిట్స్ పొందుతారని.. మంచి ఆదాయం పొందొచ్చని చెప్పడం వీడియోలో ఉంది.




### ఎలా కనిపెట్టామంటే?

పైన వీడియోలో ఎలాంటి వాస్తవం లేదు. ఈ పారిశ్రామిక వేత్తలు అలాంటి ఆటోమేటెడ్ యాప్ ఏదీ రూపొందించలేదు. ఈ వీడియోను ఏఐ ఉపయోగించి రూపొందించారు. వీడియోను మేం జాగ్రత్తగా పరిశీలించినప్పుడు ఆడియో, వీడియోలో లాగ్స్ గమనించాం. యాంకర్.. ఈ ప్రముఖుల పేర్లను కొన్ని సార్లు తప్పుగా చెప్పడం కూడా గమనించొచ్చు. వీడియోలో లిప్ సింక్ కూడా సరిగా లేదు.వీడియోను రివర్స్ ఇమేజ్ సెర్చ్ చేసినప్పుడు పూర్తి వివరాలు తెలిశాయి. 2020 మే నెలలో ఆండ్రియాస్ వాన్ డి లార్ అనే యూట్యూబ్ ఛానెల్ ప్రచురించిన ఇంటర్వ్యూ నుంచి నారాయణ మూర్తి క్లిప్ తీసుకున్నట్లు కనిపెట్టాం. మూర్తి దుస్తులు, వీడియో బ్యాక్ గ్రౌండ్ కూడా వైరల్ వీడియోతో సరిపోలింది.ఇక ముకేశ్ అంబానీని చూయించిన కీ ఫ్రేములు కూడా 2020 డిసెంబర్‌లో ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియోలో అదే విజువల్స్ ఉన్నాయి. ఈ ట్వీట్‌ను %చీణుం% ఎక్స్‌లో ప్రచురించింది. దీనిని కూడా గూగుల్ రివర్స్ ఇమేజ్ సెర్చ్ ఉపయోగించి తెలుసుకున్నాం.వీడియో డీప్‌ఫేక్ కాదా అని విశ్లేషించేందుకు తెలుగు పోస్ట్ టీమ్ డీప్‌ఫేక్స్ అనాలిసిస్ యూనిట్ ఆఫ్ మిస్ ఇన్ఫర్మేషన్ కాంబ్ట్ అలయన్స్‌ను సంప్రదించింది. ఇది కూడా వైరల్ వీడియో ఏఐ రూపొందించినదని ధ్రువీకరించింది.హైవ్ మోడరేషన్ ఏఐ టూల్ ఉపయోగించినప్పుడు .. మొదటి 30 సెకన్ల వీడియో %చీశీ-ూ×% అని తెలిసింది. కానీ మిగతాది మాత్రం ఏఐతోనే మార్చినట్లు కనుగొన్నాం. ఎక్కువగా నీలేకని విజువల్స్‌లో ఆయన ఫ్రేమ్స్ చివరి వరకు జూమ్ చేసినప్పుడు ఏఐ అని తేలింది.ఇన్విడ్ వెరిఫై టూల్‌లో భాగమైన హియా వాయిస్ డిటెక్షన్ టూల్ ఉపయోగించి కూడా ఆడియో తనిఖీ చేశాం. %ఎఱఖ% ను ఉపయోగించగా వాయిస్‌లు ఏఐ ద్వారా రూపొందించినట్లు కనుగొన్నాం. ట్రూమీడియా ఆడియో, విజువల్ డిటెక్టర్లు, ఏఐ ద్వారా ఆడియోను మార్చినట్లు కనుగొంది.

### తీర్పు ఇదే..

కాబట్టి పారిశ్రామిక దిగ్గజాలంతా కలిసి నెలకు 3 మిలియన్ల వరకు ఆదాయం పొందేలా యాప్ రూపొందించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో నిజం కాదు. దీనిని ఏఐ ద్వారానే సృష్టించారు. కాబట్టి.. వైరల్ అవుతున్న వాదనలో ఎలాంటి నిజం లేదు.



## తగ్గిన ధరలకు బ్రేక్.. మళ్లీ పుంజుకున్న బంగారం, వెండి ధరలు

బంగారం, వెండి ప్రియులకు బ్యాడ్ న్యూస్. ఎందుకంటే గత రెండు రోజులుగా తగ్గిన వీటి ధరలకు బ్రేక్ పడింది. బలమైన గ్లోబల్ ట్రెండ్, స్థానిక నగల వ్యాపారుల డిమాండ్ సహా పలు అంశాల నేపథ్యంలో బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు తిరిగి ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం దేశ రాజధానిలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ. 290 పెరిగి రూ.77,680కి చేరుకుంది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రెండు వేలకుపైగా తగ్గడం విశేషం.

**ఇవే ధరలు**

ఇదే సమయంలో నేడు (నవంబర్ 28న) ఉదయం 6.25 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,520కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 71,060కి చేరింది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 77,680కి చేరుకోగా, 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 71,210 స్థాయికి చేరుకుంది. మరోవైపు వెండి రేటు కూడా కిలోకు 200 రూపాయలకుపైగా పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com